క్లుప్తంగా

రుణాలను సకాలంలో చెల్లించాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): గ్రామ సంఘాల సభ్యులు రుణాలను సకాలంలో చెల్లించాలని ఏపీఎం రాజిరెడ్డి సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్త్రీనిధి రుణాలు సకాలంలో చెల్లించాలన్నారు. మండల సమాఖ్య అధ్యక్షులు శోభ, డీపీఎంలు సుధాకర్, సురేశ్‌కుమార్, వకుల, సీసీలు ఆంజనేయులు, లింగం, నరేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా ప్యాడ్ల పంపిణీ



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం హెల్పింగ్ ఫర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను పంపిణీ చేశారు. హెల్పింగ్ బ్రిడ్జ్‌ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ప్రతినిధి కృష్ణాకర్ రావు మాట్లాడుతూ.. విద్యార్థులు పరీక్షలకు భయపడవద్దని, ఇప్పటి నుంచే క్రమశిక్షణతో కష్టపడి చదవాలని సూచించారు. టీచర్ సుజిత పుట్టిన రోజు సందర్భంగా ప్యాడులను పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయురాలు కల్యాణి, ప్రతిభ, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం



భిక్కనూరు: మండల కేంద్రంలోని జామ మజీద్ కమిటీ నూతన కార్యవర్గాన్ని ముస్లింలు శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎండీ తాజోద్దీన్, ఉపాధ్యక్షులుగా మహ్మద్ షఫీ, అజారుద్దీన్, ప్రధాన కార్యదర్శిగా మహ్మద్ సిరాజోద్దీన్, తదితరులు ఎన్నికయ్యారు.

కంటి వైద్య శిబిరం



పిట్లం(జుక్కల్): పిట్లం ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం లయన్స్ క్లబ్ శాఖ వారు కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో కంటి వైద్య నిపుణులు హరికిషన్‌రావు, 65 మందికి కంటి పరీక్షలు చేశారు.శిబిరంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు కిషన్, లయన్స్ క్లబ్ సభ్యులు, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం భవిత సెంటర్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాల పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. స్థానిక వైద్యుడు అరుణ్‌కుమార్ ఫిజీయోథెరపి చేశారు. తల్లిదండ్రులు ప్రతీ రోజు పిల్లలకు ఫిజీయోథెరపి తప్పని సరిగా చేయించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణ, ఐఆర్‌ఈటీలు చిన్నసాయిలు, సునిల్ ఉన్నారు.

స్పీకర్‌కు పలువురి మద్దతు

బాన్సువాడ/బాన్సువాడరూరల్: వచ్చే ఎన్నికల్లో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి శుక్రవారం పలువురు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. బాన్సువాడ పట్టణానికి చెందిన పద్మశాలి సంఘం, కోటగిరి మండలం ఎత్తొండ గ్రామానికి చెందిన రెడ్డి సంఘం, బాన్సువాడ మండలం ఇబ్రహీంపేట్ గ్రామానికి చెందిన ముదిరాజ్ సంఘం సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేసి పోచారంకు అందజేశారు. వచ్చే ఎన్నికల్లో తమ సంపూర్ణ మద్దతు స్పీకర్‌కే అని పేర్కొన్నారు.

సీఎం సభ స్థలం పరిశీలన

ఈ నెల 30న బాన్సువాడకు రానున్న సీఎం కేసీఆర్ సభ ఏర్పాట్లను శుక్రవారం పోచారం శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. సమయం తక్కువగా ఉన్నందున ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగించాలని అన్నారు. సీఎం సభకు భారీ సంఖ్యలో ప్రజలు వచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని అన్నారు. మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, నాయకులు అంజిరెడ్డి, కృష్ణారెడ్డి ఉన్నారు.

జుక్కల్ చౌరస్తాలో సభకు ఏర్పాట్లు

నిజాంసాగర్(జుక్కల్): సీఎం ఎన్నికల ప్రచార సభ ఏర్పాట్లు జుక్కల్ చౌరస్తా వద్ద చురుకుగా కొనసాగుతున్నాయి. శుక్రవారం జుక్కల్ చౌరస్తా వద్ద సీఎం సభా వేదిక, హెలిప్యాడ్, పార్కింగ్ స్థలాన్ని బాన్సువాడ డీఎస్పీ జగన్నాథరెడ్డి పరిశీలించారు. ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని ఎమ్మెల్యే హన్మంత్ సింధే తెలిపారు

పోటీ చేసి వెళ్లిపోయే వాళ్లని నమ్మొద్దు

- ఎల్లకాలం కామారెడ్డి ప్రజలకు అందుబాటులో ఉంటా
- కామారెడ్డి అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డి



వెంకటరమణా రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరుతున్న అడ్లూర్ గ్రామస్తులు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు వచ్చే టూరిస్టులను నమ్మొద్దని వారు పోటీ చేసి వెళ్లిపోతారని కామారెడ్డి అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని అడ్లూర్‌లో ఆయా పార్టీలకు చెందిన 108 మంది నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరారు. రమణారెడ్డి వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కామారెడ్డి కాషాయం జెండా ఎగరవేయడం ఖాయమన్నారు. ఈ ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్, రేవంత్‌రెడ్డి లాంటి ఎంతమంది వచ్చినా ప్రజలకు అందుబాటులో ఉండరన్నారు. తాను మాత్రం ఎల్లకాలం ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సేవకే అంకితమవుతామన్నారు. మళ్లీ ఉప ఎన్నిక తెచ్చుకోవాల్సిన అవసరం కామారెడ్డి ప్రజలకు లేదన్నారు. రూ.150 కోట్లతో సేవా కార్యక్రమాల మేనిఫెస్టోను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. విద్యావైద్యంతో పాటు కామారెడ్డి నియోజకవర్గం అభివృద్ధి కోసం పాటుపడతానని హామీ ఇచ్చారు.

ఎల్లారెడ్డిలో బీజేపీ జెండా ఎగరేస్తాం



తాడ్వాయిలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి బాపురెడ్డి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో ఎల్లారెడ్డి నియోజకవర్గంలో బీజేపీ జెండాను ఎగురవేస్తామని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి బాపురెడ్డి అన్నారు. బీజేపీ మొదటి విడతలో 52 మంది అభ్యర్థులను ప్రకటించి వారిలో బీసీలు, మహిళలకు ప్రాధాన్యత ఇచ్చిందని గుర్తు చేశారు. బీజేపీలో ఉన్న రవీందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడం, గత ఎన్నికలలో కాంగ్రెస్‌లో గెలిచి బీఆర్‌ఎస్‌లో చేరిన సురేందర్‌లను ప్రజలు నమ్మరని అన్నారు. నాయకులు పార్టీలు మారినా కార్యకర్తలు మాత్రం మారరని, రాబోయే ఎన్నికల్లో కలసికట్టుగా పనిచేసి బీజేపీ అభ్యర్థిని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. రాష్ట్ర కౌన్సిల్ మెంబరు రవీందర్‌రావు, అసెంబ్లీ కన్వీనర్ లింగారావు, మండల ఉపాధ్యక్షుడు స్వామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టికెట్ కోసం దరఖాస్తు

లింగంపేట(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డిలో అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని పార్టీ సీనియర్ నాయకుడు రాజారాం నాగరాజు అన్నారు. శుక్రవారం ఆయన లింగంపేటలో మాట్లాడారు. బీజేపీలో 20 ఏళ్లుగా సామాన్య కార్యకర్తగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఎల్లారెడ్డి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి అధిష్టానానికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీని ఆదరించండి



బీర్కూర్‌లో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

బాన్సువాడ : వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని మున్సిపల్ ఫ్లోర్ లీడర్, కౌన్సిలర్ కాసుల రోహిత్ అన్నారు. శుక్రవారం బీర్కూర్ మండల కేంద్రంలో గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్యారంటీ పథకాల గురించి వివరించారు. నాయకులు దొంతురాం కాశీరం, బోయిని శంకర్, యామరాములు, తదితరులున్నారు.



గ్యారంటీ పథకాలతో అధికారం తథ్యం

భిక్కనూరు: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన గ్యారంటీ పథకాలతో రాష్ట్రంలో అధికారంలోకి రావడం తథ్యమని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, నేతలు మద్ది చంద్రకాంత్‌రెడ్డి, కుంట లింగారెడ్డిలు అన్నారు. శుక్రవారం వారు భిక్కనూరు మండలం తిప్పాపూర్, మోటాట్‌పల్లి, బస్వాపూర్ గ్రామాల్లో ఇంటింటా కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ బ్లాక్ కమిటీ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్, మండల అధ్యక్షుడు బీంరెడ్డి, నేతలు బాగారెడ్డి, జీవన్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించొద్దు



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గ్రామంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరగకుండా చర్యలు చేపట్టాలని నాగిరెడ్డిపేట ఎంపీడీవో రఘు సూచించారు. పోచారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం గ్రామస్తులతో ఆయన సమావేశం నిర్వహించారు. గ్రామంలో ఎక్కడా కూడా ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరగకూడదన్నారు. ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ఇతర బహిరంగ ప్రాంతాలలో రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు ఉండకూడదన్నారు. పంచాయతీ కార్యదర్శి తిరుపతి ఉన్నారు.

ఎస్‌ఎస్‌బీ జవాన్లతో కవాతు

మద్నూర్(జుక్కల్): రానున్న ఎన్నికల్లో ప్రజలు భయపడకుండా ఇష్టం వచ్చిన వారికి ఓటు వేసుకోవాలని ఎస్ఎస్‌బీ(సశస్త్ర సీమా బల్) జవాన్లు, కవాతు ద్వారా గ్రామస్తులకు సూచించారు. మండల కేంద్రంలో శుక్రవారం ఎస్ఎస్‌బీ జవాన్లు కవాతు నిర్వహించారు. ప్రధాన వీధులలో తిరుగుతూ ఓటర్లకు అవగాహన కల్పించారు. ఎవరైనా అభ్యర్థులు, పార్టీలకు చెందిన నాయకులు దౌర్జన్యం చేస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఎస్సై కృష్ణారెడ్డి సూచించారు. కార్యక్రమంలో బిచ్కుంద సీఐ కృష్ణ, మద్నూర్, బిచ్కుంద, పెద్దకొడప్‌గల్ ఎస్సైలు, పోలీసు సిబ్బంది ఉన్నారు.



మద్నూర్‌లో కవాతు నిర్వహిస్తున్న జవాన్లు

త్రిపుర గవర్నర్‌కు శుభాకాంక్షలు



ఎల్లారెడ్డి: త్రిపుర గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన నల్లు ఇంద్రసేనారెడ్డికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాణాల లక్ష్మారెడ్డి అభినందనలు తెలిపారు. రాష్ట్రానికి చెందిన ఇంద్రసేనారెడ్డి త్రిపుర గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించడంతో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

పలు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



గోర్గల్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ సీఈవో సంగమేశ్వర్‌గౌడ్



తిమ్మనగర్‌లో.. సీఈవో అశోక్ గౌడ్



నాగిరెడ్డిపేట: జలాల్‌పూర్‌లో.. అధికారులు

సాక్షి నెట్‌వర్క్ : జిల్లాలో శుక్రవారం పలు చోట్ల కొనుగోలు కేంద్రాలను స్థానిక సొసైటీ అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. వరి ధాన్యాన్ని ఆరబెట్టిన తర్వాత కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని రైతులకు సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని రకాల సౌకర్యాలు, సదుపాయాలు కల్పిస్తున్నామని, ధాన్య సేకరణకు కావాల్సిన గన్నీ బ్యాగులు అందుబాటులో ఉన్నాయని వారు తెలిపారు. దళారులకు అమ్మి మోసపోకుండా కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు.

రైతులకు ఇబ్బందులు కలిగించవద్దు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించవద్దని ఆర్డీవో ప్రభాకర్ సూచించారు. శుక్రవారం ఆర్డీవో కార్యాలయంలో ప్యాడీ సెంటర్ల నిర్వహణకు సంబంధించి సొసైటీ సీఈవోలు, ఏఈవోలు, రైస్‌మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ప్యాడీ సెంటర్లు ప్రారంభమైన తరువాత రైతులకు ఇబ్బందులు కలిగించకుండా కేంద్రాలను నిర్వహించాలని అన్నారు. అన్ని రకాల సౌకర్యాలను రైతులకు కల్పించాలని అన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ సురేష్ తదితరులున్నారు.



మోడెగాంలో ప్రారంభిస్తున్న తహసీల్దార్ హిమబిందు



తాడ్కోల్‌లో ప్రారంభిస్తున్న కార్యదర్శి కృష్ణమయ్య

చంద్రమౌళీశ్వరాలయంలో ఎమ్మెల్యే పూజలు



నిజాంసాగర్: మండల కేంద్రంలోని చంద్రమౌళీశ్వర ఆలయంలో శుక్రవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి జాజాల సురేందర్ అభిషేకాలు, అర్చనలు చేశారు. వేదపండితుడు సంజీవ్‌శర్మ ఆశీర్వాదం తీసుకున్నారు. బీఆర్‌ఎస్ పార్టీ అందజేసిన బీ-ఫామ్‌ను ఆలయంలో ఉంచి పూజలు చేశారు. ఆయన వెంట ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, నాయకుడు ప్రతాప్‌రెడ్డి తదితరులున్నారు.

మైసమ్మ ఆలయంలో భక్తుల సందడి

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మైలారం గ్రామంలో శుక్రవారం కొచ్చరి మైసమ్మ ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. ఆలయంలో భక్తులు కొబ్బరి కాయలు కొట్టి, నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

అందరి సహకారంతోనే జాతీయ స్థాయి అవార్డులు



అవార్డులతో ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది

బాన్సువాడ: ఆస్పత్రిలో పని చేస్తున్న ప్రతి ఒక్కరి సహకారంతోనే బాన్సువాడ ఎంసీహెచ్‌కు జాతీయ స్థాయి అవార్డులు వచ్చాయని ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆస్పత్రిలో ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించి ఇప్పటి వరకు ఆస్పత్రికి వచ్చిన అవార్డులను ప్రదర్శించారు. 1996లో మొట్టమొదటి సారిగా బాన్సువాడలో 30 పడకల ఆస్పత్రిని నిర్మించామని, ఆ ఆస్పత్రిని 2000 సంవత్సరంలో 1000 పడకల ఆస్పత్రిగా అప్పటి ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి మార్చారని అన్నారు. 2015 నుంచి బాన్సువాడ ఆస్పత్రికి రాష్ట్ర, కేంద్ర బృందాలు సందర్శించి కాయకల్ప అవార్డుకు అక్రిడిటేషన్ ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పటి వరకు ఆస్పత్రికి కాయకల్ప అవార్డు, ఎకో ఫ్రెండ్లీ అవార్డు, ఎన్‌క్వాష్, లక్ష్య, 5 స్టార్ అవార్డులు వచ్చాయని తెలిపారు. అలాగే బ్రెస్ట్ ఫీడింగ్ ఫ్రెండ్లీ అక్రిడిటేషన్ అవార్డు, బాన్సువాడ ఆస్పత్రికి వచ్చిందని తెలిపారు. సమావేశంలో వైద్యులు పి.సుధ, నర్సింగ్ కళాశాల సూపరింటెండెంట్ కృష్ణవేణి, తదితరులున్నారు.

బి-ఫాం అందుకున్న బీఎల్‌ఎఫ్ అభ్యర్థి



బి-ఫాం అందుకుంటున్న సిద్ధిరాములు

కామారెడ్డి టౌన్: బహుజన లెఫ్ట్ ఫ్రంట్(బీఎల్ఎఫ్) పార్టీ తరపున కామారెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న సిరిగాద సిద్ధిరాములు శుక్రవారం బి-ఫాంను అందుకున్నారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ చైర్మన్ నల్లా సూర్య ప్రకాష్ బి-ఫాం అందజేశారు. కామారెడ్డిలో బీఎల్ఎఫ్ విజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు. బీఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

జుక్కల్ డీఎస్పీ అభ్యర్థిగా భూమయ్య



మద్నూర్(జుక్కల్): జుక్కల్ నియోజకవర్గ డీఎస్పీ అభ్యర్థిగా మద్నూర్ మండలం మేనూర్ గ్రామానికి చెందిన విద్యావేత్త పానగంటివారి భూమయ్య పేరును శుక్రవారం ఆ పార్టీ రాష్ట్ర అధినేత డాక్టర్ విశారదన్ మహరాజ్ ప్రకటించినట్లు అభ్యర్థి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధి కోసం పోటీలో ఉండాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.

డబుల్ ధమాకా



బి-ఫాం అందుకుంటున్న అంజయ్య

బాన్సువాడ రూరల్: ఒక పార్టీ నుంచి ఒక చోట పోటీ చేయడానికి బి-ఫాం కోసం నాయకులు తంటాలు పడుతుండగా బాన్సువాడకు చెందిన ఓ సామాన్య వ్యక్తికి రెండు చోట్ల పోటీ చేయడానికి బి-ఫాం లభించడం సర్వత్ర చర్చనీయాంశమైంది. బాన్సువాడకు చెందిన కొండని అంజయ్య పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి పోటీ చేయడానికి దరఖాస్తు చేసుకున్నాడు. దీంతో ఆయనకు ఆ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు డాక్టర్ సత్యనారాయణ మూర్తి హైద్రాబాద్‌లో బాన్సువాడతో పాటు ఆర్మూర్‌లో పోటీ చేయడానికి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారు. పనిలో పనిగా బి-ఫాంలను సైతం అందజేసినట్లు అంజయ్య తెలిపారు.

సమస్యల పరిష్కారంలో వివక్ష



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ సునిత

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మాలోత్ తండావాసుల సమస్యలు పరిష్కరించడంలో ఎమ్మెల్యే జాజాల సురేందర్ వివక్ష చూపుతున్నారని సర్పంచ్ సునీత ఆరోపించారు. శుక్రవారం జీపీ పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. తండావాసులకు పోడు భూముల పట్టాలు ఇవ్వలేదని, డబుల్ బెడ్‌రూం ఇల్లు, సొంత భూమి ఉన్నా రూ.3 లక్షలు ఇవ్వలేదని, పలువురికి రైతు రుణమాఫీ కాలేదని, గ్రామ పంచాయతీ భవనం మంజూరైనా పనులు ప్రారంభించలేదని ఇలా తండా వాసులకు అన్యాయం చేశారని పేర్కొన్నారు. తాము మూకుమ్మడిగా కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వనున్నట్లు తెలిపారు.

జోరుగా బీఆర్‌ఎస్ నాయకుల ప్రచారం



లింగంపేట: ప్రభుస్వామి ఆలయంలో పూజలు చేసి ప్రచారం ప్రారంభించిన బీఆర్‌ఎస్ నాయకులు



దోమకొండలో ప్రచారం చేస్తున్న నాయకులు

లింగంపేట, సదాశివనగర్, దోమకొండ, బాన్సువాడ, భిక్కనూరు మండలాల పరిధిలో బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు ప్రచారం జోరుగా నిర్వహిస్తున్నారు. కారు గుర్తుకు ఓటు వేసి మరోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని ఓటర్లకు విన్నవించారు. గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ప్రభుత్వం చేపట్టి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరిస్తున్నారు. కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధిస్తుందని, బడుగు బలహీన వర్గాలకు మేలు జరుగుతుందని ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నేతలు వ్యాఖ్యానించారు. – సాక్షి నెట్‌వర్క్

ప్రచారాన్ని అడ్డుకున్న కాంగ్రెస్ నేతలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): వజ్జపల్లిలో శుక్రవారం బీఆర్‌ఎస్ చేస్తున్న ఎన్నికల ప్రచారాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులు అడ్డుకున్నారు. బీఆర్‌ఎస్ నాయకులను నిలదీశారు. కాంగ్రెస్ తరఫున గెలిచిన ఎమ్మెల్యే సురేందర్ బీఆర్‌ఎస్‌లోకి వెళ్లినా కూడా తమ గ్రామం ఎలాంటి అభివృద్ధిని సాధించలేదన్నారు. ఐదేళ్లలో తమ గ్రామానికి ఏం అభివృద్ధి చేశారో చెప్పాలన్నారు. గ్రామంలో ఎలాంటి ప్రచారం చేయవద్దన్నారు.



బోర్లంలో ప్రచారం చేస్తున్న నాయకులు



భిక్కనూరులో



సదాశివనగర్‌లో కార్యకర్తలతో మాట్లాడుతున్న సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి



తిమ్మోజీవాడిలో బీఆర్‌ఎస్ కరపత్రాలను విడుదల చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

సమాచారం..

■ **నేడు సామూహిక సత్యనారాయణ వ్రతం**

కామారెడ్డి అర్బన్: పున్నమి సందర్భంగా ఈనెల 28న శనివారం ఉదయం 9 గంటలకు పట్టణ పరిధిలోని దేవునిపల్లి శ్రీ వీర వెంకట రమా సహిత సత్యనారాయణ స్వామి సామూహిక వ్రతం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. అనంతర శివభక్త కమిటీ ఉచిత అన్నదానం నిర్వహిస్తున్నట్లు పేర్కొంది.

■ **నవదుర్గా వ్రతం**

కామారెడ్డి అర్బన్: స్థానిక శారదా ఆదిశంకర ఆలయంలో శనివారం ఉదయం 11 గంటలకు సామూహిక నవదుర్గా వ్రతం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి తెలిపారు. వివిధ బాధల ఉపశయనం కోసం ఆసక్తిగల భక్తులు నేరుగా వ్రతంలో పాల్గొనవచ్చన్నారు.

■ **పీవో, ఏపీవోలకు శిక్షణ**

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణ శివారులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్నికలకు సంబంధించి పీవో, ఏపీవోలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు రిటర్నింగ్ ఆఫీసర్, ఆర్డీవో ప్రభాకర్ శుక్రవారం తెలిపారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో 400 మంది పీవో, ఏపీవోలు ఉండగా వీరిలో సగం మందికి శనివారం మిగితా వారికి సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

■ **ఆలయాల మూసివేత**

మాచారెడ్డి/భిక్కనూరు/కామారెడ్డిఅర్బన్: మాచారెడ్డి మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని చంద్ర గ్రహణం కారణంగా శనివారం మూసి వేయనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కమలాకర్ రెడ్డి,ఈవో శ్రీధర్ రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భిక్కనూరు సిద్ధరామేశ్వరాలయాన్ని శనివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి ఆదివారం వేకువజాము వరకు మూసివేస్తున్నట్లు ఆలయ ఈవో శ్రీధర్ తెలిపారు. కామారెడ్డి పట్టణంలోని దేవాలయాలన్నీ శనివారం మధ్యాహ్నం నుంచి ఆదివారం ఉదయం 8గంటల వరకు మూసి ఉంటాయని ఆయా ఆలయాల అర్చకులు తెలిపారు. ఆదివారం ఉదయం 8 గంటల తర్వాత ఆలయాల సంప్రోక్షణ అనంతరం నిత్యపూజలుంటాయని పేర్కొన్నారు.

మేరీ మిట్టీ మేరా దేశ్ కోసం మట్టి సేకరణ

లింగంపేట(ఎల్లారెడ్డి): ఢిల్లీలో ఈ నెల 30, 31 తేదీలలో నిర్వహించే 'మేరీ మిట్టీ మేరా దేశ్' అంతిమ కార్యక్రమానికి లింగంపేట బాలుర ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో 31 గ్రామాల్లో సేకరించిన మట్టిని శుక్రవారం నెహ్రూ యువ కేంద్ర సంఘటన సభ్యులకు అందజేసినట్లు ప్రధానోపాధ్యాయుడు షౌకత్ అలీ తెలిపారు. సేకరించిన మట్టిని వివిధ యుద్ధాలలో అమరులైన సైనికుల జ్ఞాపకార్థంతో నిర్మించబోతున్న అమర వీరుల స్థూపానికివాడనున్నట్లు తెలిపారు. యువకులు వినోద్, సంజు, ఉపాధ్యాయులు గంగాధర్, మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి మండలం నుంచి..

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): యుద్ధంలో అమరులైన సైనికుల జ్ఞాపకార్థం నిర్మించే స్థూపానికి మండలంలోని 31 గ్రామాలలో సేకరించిన మట్టిని ఎంపీవో ప్రకాష్ శుక్రవారం నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ సభ్యులు వినోద్, సంజులకు అందించారు.